
నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలోకి ...

ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



దశ, హైదరాబాద్ : పాలిటెక్నిక్, బీఎస్సీ (గణితం) పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఈసెట్ (ECET)2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో లేటరల్ ఎంట్రీ అడ్మిషన్ల కోసం ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అధికారుల ప్రకారం జూన్ 15 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా జూన్ 15 నుంచి 18 వరకు స్లాట్ బుకింగ్, జూన్ 17 నుంచి 19 వరకు సర్టిఫికెట్ల ధ్రువీకరణ, జూన్ 17 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగనుంది. జూన్ 24లోపు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. మొదటి విడత అనంతరం తుది విడత కౌన్సెలింగ్‌ను జులై 4 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. లేటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్ లేదా ఫార్మసీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కౌన్సెలింగ్ తేదీలను గమనించి, అవసరమైన ధ్రువపత్రాలతో ముందుగానే సిద్ధంగా ఉండాలని అధికారులు సూచించారు.

ముఖ్య తేదీలు: జూన్ 15-18: స్లాట్ బుకింగ్; జూన్ 17-19: సర్టిఫికెట్ల పరిశీలన; జూన్ 17-21: వెబ్ ఆప్షన్లు; జూన్ 24: సీట్ల కేటాయింపు; జులై 4-13: తుది విడత కౌన్సెలింగ్; బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరాలనుకునే విద్యార్థులకు ఈసెట్ కౌన్సెలింగ్ కీలక అవకాశం కానుంది.

మేయర్ లక్ష్యాలకు అనుగుణంగా నగరాభివృద్ధికి కృషి: కమిషనర్



దశ, నల్లగొండ : నల్లగొండ నగరాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలనే మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, ఆస్తి పన్ను వసూళ్లు, బ్రేడ్ లైసెన్సులు, అభివృద్ధి పనులు, టౌన్ ప్లానింగ్, వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో చర్చించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణ చర్యలు, ఫాగింగ్, డ్రైన్ల డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదకర భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్ కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు వి. దిలీప్, టి. ప్రవీణ్, టౌన్ ప్లానింగ్ అధికారి జె. సుకన్య, శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వార్డ్ అధికారులు, శానిటేషన్ జవాన్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దశ, హైదరాబాద్: రోడ్డుప్రమాదంలో నడిరోడ్డుపై తీవ్రగాయాలతో మహిళ మృతి చెందింది. అయితే మృతదేహం దాదాపు 35 నిమిషాల పాటు నడిరోడ్డు పైనే ఉండిపోయింది. శేరిలింగంపల్లి పరిధిలోని మదినగూడలో ఘటన జరిగింది. 35 నిమిషాల పాటు మృతదేహాన్ని రోడ్డుపై నుండి తొలగించలేదని అధికారుల తీరుపై ప్రజల అసహనం వ్యక్తం చేసారు .ఒకవేళ తీవ్ర గాయాలతో రోడ్డుపై ఉన్నా అధికారులు ఇలానే స్పందిస్తారా అంటూ విమర్శలు గుప్పించారు.

డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ..

- సేవల మెరుగుదలపై సూచనలు



దశ, హైదరాబాద్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యాధికారి (డీఎంహెచ్ఓ) డా. పుట్ల శ్రీనివాస్ గురువారం ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కేంద్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన ఆయన, అల్ట్రాసౌండ్ యూనిట్, ఎక్స్‌రే విభాగం, ల్యాబ్, టీబీ యూనిట్, ఔషధ పంపిణీ కేంద్రం తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్ఓ పలు సూచనలు చేశారు. విధి నిర్వహణ సమయాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణులకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) గుర్తింపు పరీక్షలు, టీకాల కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజారోగ్య సేవల బలోపేతానికి ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. తనిఖీ సందర్భంగా కేంద్రంలోని సౌకర్యాలు, సేవల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే మరింత మెరుగుదలకు అవసరమైన సూచనలు అందించారు. ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లంబాడీ అధికారులపై కక్షపూరిత దాడులు చేస్తే సహించం

- లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలను తిప్పికొడతాం
- డా. కరాటే రాజు నాయక్
- తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక - ఓయూ జేఏసీ చైర్మన్



దశ ఓయూ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లంబాడీ సమాజానికి చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగుల పట్ల వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తోందని తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక, ఓయూ జేఏసీ చైర్మన్ డా. కరాటే రాజు నాయక్ ఆరోపించారు. ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ గిరిజన, లంబాడీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డాక్టర్ కరాటే రాజు నాయక్ మరియు నెహ్రూ నాయక్ మాట్లాడుతూ, లంబాడీ అధికారులపై వరుసగా ఏసీబీ దాడులు జరగడం గిరిజన సమాజంలో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే ఒకే వర్గానికి చెందిన అధికారులపై వరుస చర్యలు జరుగుతున్నాయనే భావన ప్రజల్లో బలపడుతోందని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో లంబాడీ సమాజం ముందుండి పోరాడిందన్నారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు తమ వంతు త్యాగాలు చేసి తెలంగాణ ఆకాంక్షను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుండి నేటి వరకు పరిపాలన, విద్య, వైద్యం, ఇంజనీరింగ్, పోలీస్, రెవెన్యూ తదితర రంగాల్లో వేలాది మంది లంబాడీ అధికారులు, ఉద్యోగులు రాష్ట్ర అభివృద్ధికి విశేష సేవలు అందించారని తెలిపారు. అలాంటి సమాజానికి ఈరోజు దక్కాల్సింది గౌరవం, గుర్తింపు, ప్రాధాన్యం. కానీ జరుగుతున్నది మాత్రం అవమానం, అనుమానం, వివక్ష అనే భావన గిరిజన సమాజంలో బలపడుతోందన్నారు. తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములైన లంబాడీలను అనుమానితులుగా చిత్రీకరించే పరిస్థితులు రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం అధికారంలోకి రావడంలో లంబాడీ సమాజం కీలక పాత్ర పోషించిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యధిక జనాభా కలిగిన లంబాడీ సమాజానికి మంత్రి పదవి ఇవ్వకపోవడం, గిరిజన సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం, లంబాడీల సమస్యలను నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. లగచర్ల ప్రాంతంలో లంబాడీ రైతుల భూముల సమస్యల నుండి ప్రారంభమైన వివాదాలు నేటికీ కొనసాగుతున్నాయని, లంబాడీ సమాజానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు వరుస విచారణలు, దాడులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనివల్ల లంబాడీల ఆత్మగౌరవం దెబ్బతింటోందనే ఆందోళన సమాజంలో వ్యక్తమవుతోందన్నారు.

లంబాడీ సమాజానికి తగిన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, కార్పొరేషన్‌లలో ఖాళీలనుభర్తీచేయకపోవడం,యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం, రైతులకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సంబంధించిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఉన్న గిరిజన ప్రజాప్రతినిధులు, లంబాడీ నాయకులు కూడా తమ మౌనం వీడాలని ఆయన కోరారు. సమాజం ఆత్మగౌరవం దెబ్బతింటున్న సమయంలో పదవుల కోసం మౌనం పాటించడం నాయకత్వ లక్షణం కాదన్నారు. గిరిజన ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు తమ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మరణంలోనూ మహాదానం

- ఐదుగురికి కొత్త జీవితం అందించిన భూమా గౌడ్.
- తండ్రి అవయవాలను దానం చేసి మానవత్వం చాటిన కుటుంబ సభ్యులు



దశ, మెదక్: జీవితాంతం మంచి మనిషిగా గుర్తింపు పొందిన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రానికి చెందిన జీడి భూమా గౌడ్.. మరణంలోనూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపి ఆదర్శంగా నిలిచారు. తన అవయవాలను దానం చేయడం ద్వారా ఐదుగురికి పునర్జన్మ ప్రసాదించారు. వారం రోజుల క్రితం ఇంట్లో పనులు చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు కిందపడిన భూమా గౌడ్ తలకు తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వైద్యులు ఎంత ప్రయత్నించినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి, బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. భూమా గౌడ్ అవయవాలను దానం చేసి మరికొందరికి జీవితం ఇవ్వాలని భావించి ప్రభుత్వ జీవన్ దాన్ సంస్థను సంప్రదించారు.కుటుంబ సభ్యుల అంగీకారంతో జీవన్ దాన్ ప్రతినిధులు రెండు కళ్లతో పాటు రెండు కిడ్నీలు, కాలేయాన్ని సేకరించారు.

ఈ అవయవాల ద్వారా ఇద్దరు అంధులకు చూపు లభించగా, మరికొందరు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు కొత్త జీవితం దక్కింది. అవయవాల సేకరణ అనంతరం జీవన్ దాన్ ప్రతినిధులు భూమా గౌడ్ పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తాను ఈ లోకాన్ని విడిచిపెడుతూ ఐదుగురి జీవితాల్లో ఆశాకిరణాలు నింపిన భూమా గౌడ్, ఆయన కుటుంబ సభ్యుల నిర్ణయం ప్రస్తుతం అందరి ప్రశంసలు అందుకుంటోంది. బాధలోనూ మానవత్వాన్ని చాటిన ఈ కుటుంబం సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు కొనియాడుతున్నారు.



ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు

- అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున ఉద్యమిస్తుంది.
- ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు, నల్లగొండ పార్లమెంట్ ఇంచార్జ్ బలమురి వెంకట్

దశ సూర్యాపేట ప్రతినిధి : సర్ పేరుతో ఓటర్ల హక్కులను హరించవద్దని ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు, నల్లగొండ పార్లమెంట్ ఇంచార్జ్ బలమురి వెంకట్, ఏఐసీసీ ఓబీసీ నాయకులు, సూర్యాపేట నియోజకవర్గ సమన్వయ కర్త ప్రొ. కత్తి వెంకట స్వామి లు ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్ లో బూత్ లెవల్ ఏజెంట్ల కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ వలన పేదలు, కార్మికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు అవసరమైన పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.

అయితే వారి ఓటు హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ కు ఉందన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అంతటి గొప్ప ఆయుధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ హరించరాన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే చర్యలు అంగీకరించబోమని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తుందని, ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తుందన్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, తూముల సురేష్ రావు, ధారవత్ వీరన్ననాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, మున్సిపల్ కౌన్సిలర్లు, బూత్ లెవల్ ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ 12 ఏళ్ల సేవా కాలం సందర్భంగా ప్రత్యేక పూజలు



దశ ఓయూ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాభివృద్ధి, పేదల సంక్షేమం, సుశాసనం, జాతీయ భద్రత మరియు భారతదేశాన్ని ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తూ 12 ఏళ్ల పుష్కరకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజుల ప్రధానమంత్రి పదవీకాల రికార్డును అధిగమించి నేటితో 4,400 రోజుల చారిత్రాత్మక మైలురాయిని చేరుకున్న సందర్భంగా నాచారం డివిజన్ హెచ్ఎంటీ నగర్‌లోని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించాము.ఈ సందర్భంగా దేశం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, “వికసిత్ భారత్ - 2047” లక్ష్యం సాకారం కావాలని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయన ఆయురారోగ్యాలతో దేశసేవలో మరింత కాలం కొనసాగాలని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశాము. గత 12 సంవత్సరాలలో దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విప్లవం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు అవకాశాల కల్పన, పేదల జీవన ప్రమాణాల మెరుగుదల వంటి అనేక రంగాల్లో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు.ప్రపంచ దేశాల మధ్య భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచడంలో ప్రధానమంత్రి మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు , ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్ పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొమ్మగల్లా నవీన్ కుమార్, అనిత పద్మారెడ్డి, వై. సత్యనారాయణ, ప్రకాష్,బెక్కరి రవీంద్రారెడ్డి, మోహన్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, పాదం వెంకటేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి, వరలక్ష్మి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



15 ఏళ్ల వెనుకబాటుతనానికి చెక్..

- ఇబ్రహీంపట్నంలో అభివృద్ధి జోరు!
- రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- 400 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

దశ, పెద్దఅంబర్‌పేట్ : గత 15 ఏళ్లలో అభివృద్ధికి దూరమైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. రెండున్నరేళ్లలోనే దాదాపు రూ.3 వేల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గానికి తీసుకొచ్చామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట్‌లో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాలకు చెందిన మొత్తం 400 మంది లబ్ధిదారులకు రూ.4.46 కోట్ల విలువైన ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పాలకులు తెలంగాణ సంపదను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారాలు లభిస్తున్నాయని, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ వంటి అభివృద్ధి ప్రాజెక్టులను వ్యతిరేకించే వారికి భవిష్యత్తు ఉండదని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే, రానున్న రోజుల్లో ఇబ్రహీంపట్నాన్ని రాష్ట్రంలో నంబర్ 1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర

భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట

WWW.DASHANEWS.COM

సోని విజన్ షాప్‌లో చోరీ నిందితులను పట్టుకుంటాం

❖ కీలక ఆధారాలు, వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

❖ ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్



దశ, ఖమ్మం: ఖమ్మం నగరంలోని ప్రముఖ విక్రయ కేంద్రమైన 'సోని విజన్' షోరూమ్‌లో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేలా పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుర్తుతెలియని దుండగులు షాపు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, స్టాక్ రూమ్‌లో భద్రపరిచిన విలువైన అధునాతన మొబైల్ ఫోన్లు చోరీ జరిగినట్లు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. షాపు పరిసర ప్రాంతాలలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

బీజేపీ కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనం

❖ డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న



దశ, కొత్తగూడెం: తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్, సీనియర్ నాయకురాలు శ్రీమతి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించడాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ విషయంపై డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అధ్యక్షతన కొత్తగూడెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ, తెలంగాణలో తప్పుడు క్రిమినల్ కేసులు ఉన్నాయనే నెపంతో "క్రిమినల్ కేసుల వివరాలు నామినేషన్‌లో పొందు పరచలేదనే సాకుతో మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించడం వెనుక బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోంది" అని ఆరోపించారు. "బీజేపీ ఫిర్యాదు చేయగానే హడావిడిగా నామినేషన్ తిరస్కరించి, వారి అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నిక చేశామని ప్రకటించుకోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. దీనిపై న్యాయపరంగా పోరాటం చేస్తాం. ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేస్తాం. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మన పోరాటం కొనసాగుతుంది" అని మేడమ్ క్యాడర్‌కు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు చీకటి కార్తీక్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం ప్రసాద్ బాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు , కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలి: మచ్చా వెంకటేశ్వర్లు



దశ, మణుగూరు: ఎగురుతున్న ఎర్రజెండాల మధ్య, CPM అనుబంధ యూనియన్ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభల సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. "అటవీ భూములకు పట్టాలివ్వాలి - కూలి రేట్లు పెంచాలి - భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలి" అనే నినాదాలతో వ్యవసాయ కార్మికులు, ఆదివాసీలు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి తమ డిమాండ్లను చాటారు. వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని, ఆదివాసీల హక్కుల రక్షణకు, భూ హక్కుల సాధనకు కదలాలని ఈ మహాసభ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు అన్నవరపు కనకయ్య, నిమ్మల వెంకన్న, నెల్లూరి నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, గద్దల శ్రీనివాస్ రావు, దడిగెల వెంకన్న, మడివి రమేష్‌తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సేవలు ఎంతో గొప్పవి

❖ ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్



దశ, మణుగూరు: మణుగూరు, జగన్నాధపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో ఆశాల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన అంతర ఇంజెక్షన్, ఛాయ మాత్రలు, మాలా ఎన్, మాలాడి, నిరోధ్ వంటి సేవలను అర్హులైన దంపతులకు అందించాలని సూచించారు.

పిల్లల మధ్య తగిన విరామం (Spacing) ఉండేలా ప్రోత్సహించాలని తెలిపారు. గర్భిణీలలో అధిక ప్రమాద లక్షణాలు ఉన్న గర్భిణులను (High Risk ANC) ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేయాలని, గర్భిణీలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. మాతృ మరణాల రేటు (MMR) మరియు శిశు మరణాల రేటు (IMR) తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

సాధారణ ప్రసవాలను పెంచి, అవసరం లేని సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రతి గర్భిణికి సమయానికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రజలు సమతుల్య ఆహారం (Balanced Diet) తీసుకోవాలని, "Eat Right - Stay Healthy" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బ (Sun stroke) బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోజుకు సరిపడా నీరు త్రాగాలని, మధ్యాహ్న వేళల్లో అవసరం లేనప్పుడు బయట తిరగవద్దని సూచించారు. ప్రతిరోజూ నడక (Walking), యోగా, వ్యాయామం చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆరోగ్య, వెల్‌నెస్ కార్యకలాపాలు (Health & Wellness Activities) నిర్వహించి ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని సూచించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని, పరిశుభ్రత పాటించాలని కోరారు. వర్షాకాలంలో విరేచనాల వ్యాధుల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అలాగే జూన్ 28 వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలను పూర్తిగా గుర్తించి, ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలికలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు HPV వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, అర్హులైన బాలికలకు టీకాలు అందేలా చూడాలని సూచించారు.

ప్రస్తుత వర్షాకాలం మరియు మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు మరియు విరేచనాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డా. తుకారాం రాథోడ్ సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల నివారణ చర్యలు పాటించడం, తాగునీటిని మరిగించి లేదా శుద్ధి చేసి వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఏవైనా జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు Dr ప్రతాప్ Dr హరీష్ హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



భద్రాచలంలోని లాడ్జీలు, బస్టాండ్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

దశ, భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈరోజు రాత్రి 12.30 గంటల నుండి తెల్లవారుజామున 5.00గంటల వరకు భద్రాచలంలోని లాడ్జీలు, బస్టాండ్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల ధ్యేయంగా సోదాలు చేపట్టామని డిఎస్పి అరుణ్ కుమార్ తెలిపారు. భద్రాచలం పట్టణంలోని మొత్తం 62 లాడ్జిలతో పాటు స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ఈ తనిఖీలు కొనసాగాయి. ఫింగర్ ప్రింట్ డివైస్లులు, డాగ్ స్క్వాడ్ బృందాలతో లాడ్జిలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సోదాల సమయంలో లాడ్జిల్లా యజమానులు, మేనేజర్లు, సిబ్బంది యొక్క పూర్తి వివరాలు సేకరించి, లాడ్జిలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజ్ కనీసం 2 నెలల పాటు బ్యాకప్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, లాడ్జి వెలుపల రహదారిపై వచ్చి పోయే వాహనాల కదలికలను స్పష్టంగా రికార్డు అయ్యేలా కెమెరాలను రోడ్డు వైపు అమర్చాలని ఆదేశించారు. పట్టణ ప్రజల భద్రత దృష్ట్య ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినట్లయితే పోలీస్ వారికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో భద్రాచలం పట్టణ CI మడిపల్లి నాగరాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో రాయితీ కల్పించండి



❖ జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి జిల్లా విద్యాశాఖ అధికారికి టిడబ్ల్యూజేఎఫ్ వినతి

❖ జర్నలిస్టుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్న అధికారులు

దశ, కొత్తగూడెం: ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకు 2026 27 సంవత్సరానికి సంబంధించిన ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టీజేఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కో కన్వీనర్ జి వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏసిజీఈ హెచ్ మాధవరావు, సీనియర్ సూపరిండెంట్లు శ్రీధర్ స్వామి, సురేష్‌లకు వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా జిల్లా కో కన్వీనర్ జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... భద్రాద్రి జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు.

ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేక పోతున్నారని కావున జర్నలిస్టుల పిల్లలకు ప్రతి సంవత్సరం లాగానే ఈ 202627 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరడం జరిగిందన్నారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ రామిశెట్టి సైదయ్య, జిల్లా ఫెడరేషన్ సభ్యులు నేరెళ్లకుంట్ల సుధాకర్ రావు,వి రాజేందర్, పి రాధాకృష్ణ, పి లెనిన్ విజయ్ కుమార్, కుంజా వెంకటేష్, ఎస్ కే జాఫర్, తేజవత్ వెంకటేష్, రాచకొండ నాగేశ్వరరావు, ఎస్ డి రబ్బాని, వీరబోయిన రాంబాబు, ఏ శ్రీను, జె సంపత్, కే సంపత్, జి నాగరాజు పాల్గొన్నారు.

అశ్వారావుపేటని అగ్రగామిగా నిలబెట్టడమే నా ధ్యేయం

❖ శాసనసభ్యులు జారే ఆదినారాయణ





దశ, అశ్వారావుపేట: హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మరియు రాష్ట్ర మంత్రులను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కేటాయింపు అంశాన్ని ప్రస్తావించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కలిసి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ కీలక అభివృద్ధి పనులకు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించాలని కోరారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కని కలిసి ఏజెన్సీ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారం మరియు గ్రామీణ ప్రగతి నిధుల మంజూరుకై విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసి అశ్వారావుపేట నియోజకవర్గ యువత కోసం క్రీడా మైదానాల (స్టేడియం) ఏర్పాటు, క్రీడా మౌలిక సదుపాయాల కల్పన మరియు మైనారిటీ సంక్షేమ నిధులపై చర్చించారు. అంతరం గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హైదరాబాద్ లోని తెలంగాణ సెక్రటేరియట్ నందు అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన అనారోగ్య బాధితుల నుంచి స్వీకరించిన ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) దరఖాస్తులను ఆ విభాగంలో సంబంధిత అధికారులకు అందజేశారు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్న తరుణంలో ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయంతో పాటు నిమ్స్ ఆసుపత్రిలో విలువైన వైద్యం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెండింగ్ ప్రాజెక్ట్‌ల పనులు వెంటనే పూర్తి చేయాలి

❖ డిప్యూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్



దశ, కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనుల పూర్తి, సాగునీటి విస్తరణ లక్ష్యాలపై హైదరాబాద్ జలసౌధలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకసమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పురోగతి, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, మున్నేరు-పాలేరు లింక్ కాలువ పనులతో పాటు భూసేకరణ, పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్), అటవీ అనుమతుల అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టుల వారీగా పనుల ప్రస్తుత స్థితి, నిర్దేశిత లక్ష్యాలు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో సమీక్షించి, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి విస్తరణ, రైతులకు స్థిరమైన నీటి వనరుల కల్పన, ప్రాజెక్టుల సకాలంలో పూర్తి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సమావేశంలో స్పష్టం చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.